క్లుప్తంగా

మల్లికార్జునస్వామి దేవస్థానం వద్ద భారీ అన్నదానం



గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం భారీ అన్నదానాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద హోమం, ప్రత్యేక పూజాలతో పాటు ఆలయంలోని మూలవిరాట్టుకు ప్రధాన అర్చకులు చంద్రశేఖరశర్మ విశేష అలంకారాన్ని చేశారు. దాదాపు 500 మంది భక్తులకు అన్నదానం చేశారు.

ఆకట్టుకున్న వీణ నాదార్చన



పాత గుంటూరు: బ్రాడీపేటలోని ఓంకార క్షేత్రంలో మహా శివరాత్రి పురస్కరించుకొని శుక్రవారం నుంచి 24 గంటల పాటు నిర్విరామంగా సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీ భారతి సంగీత నిలయం వ్యవస్థాపకులు భారతీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన వీణ నాదార్చనలో కె. నాగలక్ష్మి, సాయిలక్ష్మి పలు కీర్తనల్ని వీణలపై వీనుల విందుగా పలికించి ఆహూతుల్ని అలరించారు. వీరికి మృదంగంపై జగన్మోహిని వాయిద్య సహకారాన్ని అందించారు.

సాయుధ బలగాలతో కవాతు



పట్నంబజారు: నగరంలోని లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం సాయుధ బలగాలతో కలసి పోలీసులు కవాతు నిర్వహించారు. స్టేషన్ ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో లాంచస్టర్ రోడ్డు, ఎల్ఆర్ కాలనీ, ఐపీడీకాలనీ తదితర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు ధైర్యం కల్పించే విధంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పబ్లిక్ పరీక్షల్లో ఆందోళన వద్దు

పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు



విద్యార్థినికి హాల్ టికెట్ అందజేస్తున్న శ్రీధర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: పబ్లిక్ పరీక్షల పేరుతో అర్థం లేని ఆందోళన వద్దని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు సూచించారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పదో తరగతి అనేది పాఠశాల విద్యార్థి దశలో చివరి దశ అన్నారు. దాన్ని విజయవంతంగా పూర్తి చేసి, ఇంటర్మీడియెట్ దశలోకి అడుగుపెట్టేందుకు సిద్ధం కావాలని సూచించారు. పాఠశాల విద్యార్థిగా గడిపిన రోజులు జీవితాంతం గుర్తుండిపోతాయని, పదో తరగతి పరీక్షలు రాసిన తరువాతే ఇచ్చే సర్టిఫికెట్ జీవితంలో ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. ప్రతి క్రికెటర్ తన చివరి ఓవర్‌లో శక్తినంతటినీ కూడగట్టుకుని ఏ విధంగా పరుగులు సాధిస్తారో, టెన్త్ విద్యార్థులు సైతం ఏడు పరీక్షల్ని అంతే సమర్థంగా ఎదుర్కోవాలని చెప్పారు. ఏడాది పొడవునా విద్యార్థులు చదివిన పాఠ్యాంశాలే ప్రశ్న పత్రంలో వస్తాయని, సక్రమమైన ఆలోచనలు, మానసిక ప్రశాంతతో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హాల్ టికెట్లు, ప్యాడ్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖరరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సమాజంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సంతోష్‌కుమారి, పక్కన కార్పొరేటర్ గురవయ్య, హెచ్ఎం రాంబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు చదువుతో పాటు సమాజంపైనా అవగాహన అవసరమని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్-1 విభాగ కార్యక్రమ నిర్వహణాధికారిణి ఎం. సంతోష్ కుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్-1 విభాగ ఆధ్వర్యంలో శనివారం కేవీపీ కాలనీలో వారం రోజుల ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలోని నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంతోష్‌కుమారి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు సమాజంపై అవగాహన కల్పించేందుకు ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కాలనీలో ఈనెల 15వ తేదీ వరకు వివిధ సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్థానిక కార్పొరేటర్ కె. గురవయ్య మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు సేవా శిబిరాన్ని నిర్వహించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి మాట్లాడుతూ కళాశాల ఎన్ఎస్ఎస్-1 విభాగ విద్యార్థిని పి. ప్రియశ్రీ ఢిల్లీలో ఈనెల 4,5,6వ తేదీల్లో జరిగిన జాతీయ యువ పార్లమెంట్ ఉత్సవాల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. మొదటి రోజు శిబిరంలో భాగంగా ప్రజల విద్య, వైద్య, ఆరోగ్యం, ఆహార, శుభ్రత, ఆర్థిక స్థితిగతుల గురించి విద్యార్థులు సమాచార సేకరణ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం. రాంబాబు, ఐటీసీ ప్రతినిధి కె. వీరనారాయణ, అధ్యాపకులు శ్రావణి, పద్మజ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఉద్యోగినులకు సన్మానం



డాక్టర్ శైలజను అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: రాయల్, క్యాప్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఉద్యోగినులను సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నేడు మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాయల్, క్యాప్స్ సంస్థల అధినేతలు బాలాజీ, దేవినాయుడు పాల్గొన్నారు.

హెచ్ఐవీ చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

జీజీహెచ్‌లోని శుశృత హాలులో శనివారం హెచ్ఐవీతో బాధపడుతున్న చిన్నారులకు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ పౌష్టికాహారం పంపిణీ చేశారు. అమ్మ ట్రస్టు, మానవతా సేవాసమితికి చెందిన ప్రశాంతికుమారి మాట్లాడుతూ చిన్నారులకు డ్రైఫ్రూట్స్, భోజన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థినికి ఏఆర్టీ సెంటర్ డాక్టర్ రవిశంకర్ రూ. 3వేలు ఆర్థిక సాయం చేశారు. చర్మవ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు డాక్టర్ కిరణ్‌కుమార్ సబ్బులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సరోజిని, ముస్తఫా, వర్మ పాల్గొన్నారు.

రేపు ఇస్లామిక్ కౌన్సిలింగ్ సెంటర్ నిర్మాణానికి ప్రారంభోత్సవం



ఎమ్మెల్యే రోశయ్యకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ముస్లిం మత పెద్దలు, షాదిఖానా కమిటీ సభ్యులు

పట్నంబజారు: పట్టాభిపురంలో ఈనెల 11న మౌలానా అబుల్‌కలాం అజాద్ షాదిఖానా వెనుక ఉన్న ఇస్లామిక్ కౌన్సిలింగ్ సెంటర్ భవన నిర్మాణ ప్రారంభోత్సవానికి హాజరు కావాలని పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కిలారి రోశయ్యను షాదీఖానా కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు ఆహ్వానించారు. కృష్ణనగర్‌లోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ ముస్లింలు వైఎస్సార్ సీపీకి పట్టుగొమ్మలని చెప్పారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మైనార్టీలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేశారని తెలిపారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత మహానేత వైఎస్సార్‌కే దక్కుతోందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ముస్లింలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, షాదిఖానా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.